క్లుప్తంగా

శరవేగంగా వెంకన్న ఆలయ నిర్మాణం



తుది దశలో వెంకన్న ఆలయ పనులు

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో తలపెట్టిన వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.5 కోట్ల వ్యయంతో ఆలయ నిర్మాణం చేపట్టేందుకు స్థానికులు శ్రీకారం చుట్టారు. ఇందు కోసం దాతల సహకారం తీసుకుంటున్నారు. పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విరాళాలు అందజేస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వచ్చే ఏడాది ప్రథమార్థంలో ఆలయ నిర్మాణం పూర్తి చేసేలా కమిటీ సభ్యులు కృషి చేస్తున్నారు.

ఉపాధి హామీ పథకంతో మూలపేట అభివృద్ధి



మాట్లాడుతున్న మూలపేట సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక: ఉపాధి హామీ పథకం ద్వారా మూలపేట అభివృద్ధి చెందిందని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు అన్నారు. మూలపేటలో శనివారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలపేట గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా సహకరించాలన్నారు. అర్హులైన పేదలకు జాబ్‌కార్డులు అందజేస్తామన్నారు. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి మొల్లేటి గంగాధర్, ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర, ఆడారి కాశీరావు, ఆడారి జగన్నాథరావు, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

గ్రామంలో పరిశుభ్రత పాటించాలి



సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

పాయకరావుపేట: ప్రతి గ్రామంలో పారిశుధ్య లోపం తలెత్తకుండా సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటన లో భాగంగా శనివారం మండలంలోని మంగవరం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై చెత్తలు వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటి వద్ద నుంచి తడిచెత్త, పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంగలపూడి సరస్వతీ రామారావు, ఎంపీటీసీ గూటూరు విజయలక్ష్మి, రామగోవిందు, కార్యదర్శి వై.వి.సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కల్వర్టుకు శంకుస్థాపన



కల్వర్టుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అనిత

నక్కపల్లి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శనివారం అమలాపురంలో సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పలువురు మహిళలతో ముచ్చటించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అనే విషయాలు ఆరా తీశారు. అనంతరం గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న ఆర్‌అండ్‌బీ కల్వర్టుకు శంకుస్థాపన చేశారు. సర్పంచ్ శంకర్రావు, టీడీపీ మండల అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, పాయకరావుపేట పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలు, తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: మండలంలోని నరేంద్రపురంలో శనివారం టీడీపీ నేతలు సాయికృష్ణ, రమేష్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించారు.

తలుపులమ్మతల్లి బోనాల మహోత్సవం నేడు



కోటవురట్ల: తంగేడు శివారు కాటా వద్ద కొలువుదీరిన తలుపులమ్మతల్లి అమ్మవారి బోనాల మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్టు సర్పంచ్ కొరుప్రోలు శివకుమార్ తెలిపారు. గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో బోనాలతో ఊరేగింపు నిర్వహించి పూజలు చేయనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ఆకర్షణీయంగా ముస్తాబు చేశారు. అమ్మవారిని వెండి ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు.

ట్రాఫికర్..!



ట్రాఫిక్ సమస్య కారణంగా కిలోమీటర్ల మేర తరచూ నిలిచిపోతున్న వాహనాలు



రహదారిపై పడిన భారీ గుంతలు



యలమంచిలి రహదారిలో ప్రమాదకర గొయ్యి

- ఫ్లైఓవర్ నిర్మాణ పనులతో అవస్థలు
- ప్రత్యామ్నాయ రహదారుల లేక ఇబ్బందులు
- భారీ గుంతలతో వాహనచోదకుల బెంబేలు



ఇటీవల కురిసిన వర్షాలకు అధ్వానంగా తయారైన అచ్యుతాపురం కూడలి రోడ్డు

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం కూడలిలో ట్రాఫిక్ స్తంభించిపోవడం నిత్యకృత్యంగా మారింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండలో నిరీక్షించలేక నానా అవస్థలు పడుతున్నారు. వాహనాల రద్దీతో రోజురోజుకూ ఈ సమస్య తీవ్రతరమవుతోంది. మరోవైపు చిన్నపాటి చినుకులు పడితే చాలు రహదారులు చిత్తడిగా మారుతున్నాయి. అచ్యుతాపురం కూడలిలో వాహనాలకు సరైన ప్రత్యామ్నాయం చూపించకుండా ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నాయి. ఉన్న చిన్నపాటి మార్గంలో అనుమతి లేకుండా భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రహదారిపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గోతులన్నీ చెరువును తలపించాయి. ఎక్కడ గుంతలున్నాయో తెలియని పరిస్థితిలో వాహన చోదకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్న దుస్థితి నెలకొంది. అదుపు తప్పితే ఫ్లైఓవర్ నిర్మాణానికి చేపడుతున్న ఫౌండేషన్ గోతుల్లో జారి పడిపోయే ప్రమాదం ఉంది.

ప్రత్యామ్నాయం చూపాలి



అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వెళ్లే రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. ప్రత్యామ్నాయ రహదారులు చూపించకుండా ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేపట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల దారుల్లో ప్రయాణంతో వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఎప్పుడు ఏ దారి మూత పడుతుందో తెలియని పరిస్థితి. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయం కల్పించాలి.

– రొంగలి రాము, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

గమ్యస్థానాలకు చేరుకోవడం గగనమే..

వందలాది పరిశ్రమలు, వేలాది వాహనాలకు అచ్యుతాపురం కూడలే కేంద్రం కావడంతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది. అత్యవసర సేవలకు కూడా ఇబ్బందులు తప్పట్లేదు. ఉద్యోగులు, విద్యార్థులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడంతో గమ్యస్థానాలకు ఆలస్యంగా చేరుకుంటున్నారు. ముఖ్యమైన పనులపై వెళ్లే వారు ట్రాఫిక్ ఇబ్బందుల కారణంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. కంపెనీల్లో విధులకు హాజరయ్యే కార్మికులు సమయానికి చేరుకోలేక యాజమాన్యం నుంచి హెచ్చరికలకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. ప్రస్తుతం రహదారులు పూర్తిగా గుంతలతో నిండి ప్రమాదకరంగా మారాయి. భారీ వాహనాలకు అనకాపల్లి నుంచి అచ్యుతాపురం రహదారిపై వెళ్లడానికి అనుమతి లేదు. రాజకీయ అండదండలతో వాహనాలు రాకపోకలు సాగించడంతో అంతంత మాత్రాన ఉన్న దారులన్నీ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఏమాత్రం ఆదమరిచి ప్రయాణించినా గుంతల్లో పడి గాయాలు పాలయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూడలిలో రాకపోకల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు పరామర్శ



వైఎస్సార్‌సీపీ నాయకుడు గణేష్‌ను పరామర్శిస్తున్న కంబాల జోగులు, చిక్కాల రామారావు

పాయకరావుపేట: ఇటీవల శస్త్ర చికిత్సలు చేసుకుని ఇళ్ల వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఇద్దరు వైఎస్సార్‌సీపీ నాయకులను మాజీ ఎమ్మెల్యే, పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు పరామర్శించారు. శ్రీరాంపురంలో ఇటీవల నేత్ర శస్త్ర చికిత్స చేయించుకున్న గణేష్‌ను, ఎస్.నర్సాపురం జెడ్పీహెచ్ పేరెంట్స్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ బెదిరెడ్డి యశోదను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకు డు ధనిశెట్టి బాబూరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, సర్పంచ్‌లు పన్నీరు పాపారావు, కోటేశ్వరరావు, గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, సూరకాసుల గోవిందు, గ్రామశాఖ అధ్యక్షులు తిరుమలరాజు నరసింహరాజు, ఎంపీటీసీ పులగల రాంబాబు, శ్రీరాంపురం నాయకులు బగ్గు వీసన్న, గంగిరెడ్డి పెదబాబు, బోడపాటి గోవిందు, గంగా రావు, చంటి, సురేష్ పాల్గొన్నారు.

15న నక్కపల్లిలో జాబ్‌మేళా

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈ నెల 15న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ జాబ్‌మేళాలో 14 ప్రముఖ కంపెనీలు హాజరు కానున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రాంత నిరుద్యోగులంతా ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెరువుల్లో మట్టి దొంగలు.!

- యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు



ఈదటంలోని వెంకటపతిరాజు చెరువు గట్టును పొక్లెయిన్‌తో తవ్విన దృశ్యం

పాయకరావుపేట: సాగునీటి చెరువుల్లో మట్టి దొంగలు పడ్డారు. యథేచ్ఛగా విలువైన గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పాయకరావుపేట మండలంలోని పలు గ్రామాల పరిధిలో ఉన్న సాగునీటి చెరువుల్లో గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. గోపాలపట్నం ఆవ, శ్రీరాంపురం, ఎస్.నర్సాపురం, కందిపూడిలో పెద్ద చెరువు, తమ్మయ్య చెరువు, ఈదటంలో పాయకరాని చెరువు, వెంకటపతిరాజు చెరువు ఉన్నాయి. ఈ చెరువుల్లో రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఏవిధమైన అధికారుల అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారు. రాత్రి సమయంలో పొక్లెయిన్‌లు ఉపయోగించి తవ్వకాలు చేపట్టి 25 ట్రాక్టర్లతో నిత్యం మట్టిని రవాణా చేస్తున్నారు. పంట పొలాలకు సాగునీరు సరఫరా చేసే చెరువుల్లో మట్టి తీసివేస్తుంటే చెరువుల గర్భం మరింత లోతుగా తయారవుతోంది. దీంతో రైతులకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారుతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈదటంలో 22 ఎకరాల విస్తీర్ణంలో సాగునీటి చెరువు ఉంది. సుమారు 100 ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. అటువంటి ఈ చెరువు నుంచి గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి మండలంలోని చెరువుల్లో గ్రావెల్ తవ్వకాలను నివారించాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఈ విషయమై నీటి పారుదల శాఖ ఏఈ వినయ్‌కుమార్‌ను సంప్రదించగా.. చెరువులను పరిశీలించి గ్రావెల్ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం: మండలంలోని కొండకర్ల సబ్‌స్టేషన్ పెదపాడు ఫీడర్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ పనుల నిమిత్తం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ హరిపాలెం, అందలాపల్లి, తిమ్మరాజుపేట, పెదపాడు, ఖాజీపాలెం, జగ్గన్నపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. ఆయా గ్రామాల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అప్పన్నపాలెంలో హోమియో వైద్య శిబిరం

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం గొరపూడి శివారు అప్పన్నపాలెంలోని గ్లోరియో ఇమ్మాన్యుయేల్ చర్చిలో శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. అచ్యుతాపురానికి చెందిన మోరి హోమియో ఆస్పత్రి సిబ్బంది సుమారు 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన హోమియో మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మోరి, పాస్టర్ సుధీర్‌కుమార్, గొర్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై ఇప్పుడు మాట మారుస్తారా?



నిరసన తెలుపుతున్న పెదగుమ్ములూరు గ్రామ మహిళలు

కూటమి ప్రభుత్వంపై పెదగుమ్ములూరు మహిళల ఆగ్రహం

ఎస్.రాయవరం: ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు బిగిస్తే పీకి బూడిద చేయాలని సీఎం చంద్రబాబు తనయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పిలుపునిచ్చారని, ఇప్పుడు అధికారంలో వచ్చాక అవే మీటర్లు ఎలా బిగిస్తారని సీపీఎం నాయకుడు ఎం.సత్యనారాయణ ప్రశ్నించారు. పెదగుమ్ములూరుగ గ్రామంలో పెరిగిన విద్యుత్ బిల్లు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయొద్దంటూ శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పిన మాటలు ఒకటి, ఇప్పుడు చెప్పేవి ఒకటని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలలు వ్యవధిలోనే గ్రామాల్లో స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, విద్యుత్ చార్జీలు పెంచి, తల్లికి వందనం అర్హత నుంచి చాలా మందిని తప్పించారని ఆరోపించారు. ఏ ప్రభుత్వం వచ్చినా 200 యూనిట్లు వరకు రాయితీ ఇచ్చేవారని ఇప్పుడు స్మార్ట్ మీటర్లు బిగిస్తే ఎస్సీ ఎస్టీ వారికి రాయితీ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లు వల్ల ముందుగా రీచార్జ్ చేసుకోవాలని, విద్యుత్ సరఫరా సక్రమంగా ఉంటాదో ఉండదో తెలియని పరిస్థితిలో ముందుగా రీచార్జ్‌లు ఎలా చేసుకుంటారని నిలదీశారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రామస్తులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

ఉప్పవరంలో పట్టపగలే గ్రావెల్ దందా



పొక్లెయిన్‌తో గ్రావెల్‌ను ట్రాక్టర్లకు లోడు చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం రూరల్ : ఉప్పవరం గ్రామంలో పట్టపగలే గ్రావెల్ దందా సాగుతోంది. శని, ఆదివారాలు రెవెన్యూ సిబ్బందికి సెలవు ఉంటుందనే ధీమాతో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. శనివారం ఉప్పవరం గ్రామంలో ఉన్న కొండ ప్రాంతం సర్వే నంబర్ 87లో పొక్లెయిన్ సహాయంతో తవ్వి సుమారు 4 ట్రాక్టర్లతో గ్రావల్‌ను తరలించుకుపోయారు. కొందరు స్థానికులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో తాత్కాలికంగా నిలిపివేశారు. ఎవరూ లేని సమయం చూసుకొని తిరిగి అక్రమార్కులు రెచ్చిపోవచ్చునని స్థానికులంటున్నారు. స్థానిక రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేసినప్పటికీ నిర్లక్ష్యం చేయడం కారణంగా గ్రావెల్ అక్రమంగా తరలిపోయినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుని, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా జగన్నాథస్వామి అండీలు పండగ



కె.జె.పురంలో జగన్నాథస్వామి అండీలతో తాచేరు నది నుంచి ఊరేగింపుగా వస్తున్న భక్తులు



పేటలో జగన్నాథస్వామి ఆలయానికి నీటి కుండలతో వెళ్తున్న గ్రామస్తులు

మాడుగుల రూరల్ : జగన్నాథస్వామి రథయాత్ర తర్వాత స్వామివారి అండీలు పండగ కె.జె.పురం గ్రామంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆషాఢ మాసంలో పూరీలో జగన్నాథస్వామి రథయాత్ర జరిగిన మరుసటి వారంలో వచ్చే శనివారం ఈ గ్రామంలో అండీళ్ల పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. గ్రామస్తులు శనివారం ఉదయం పెద్ద పెద్ద కుండలు(అండీలు) పట్టుకుని ఊరేగింపుగా సమీపంలో గల తాచేరు నదికి వెళ్లి, అక్కడ కుండల్లో నీరు, పండ్లు నింపుకుని ఇళ్ల వద్దకు వచ్చి పరమాన్నం, భోజనాలు వండి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు పెట్టారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : విజయరామరాజుపేట గ్రామంలో జగన్నాథస్వామి పండగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో పౌర్ణమి వెళ్లిన తరవాత వచ్చే శనివారం రోజున జగన్నాథస్వామి పండగను చేయడం ఆనవాయితీగా వస్తుంది. గ్రామస్తులంతా నీటి కుండలతో జగన్నాథస్వామి పీఠం వద్దకు వెళ్లి ప్రసాదాలు వండి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి వసంతంను తమపైన, ఇళ్లల్లో, పశువులపై జల్లి ఎటువంటి అంటురోగాలు ప్రబలకుండా కుటుంబ సభ్యులంతా సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంటలు బాగా పండాలని గ్రామస్తులు పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

బైక్‌పై వెళ్తున్న వారిని ఢీకొట్టిన లారీ

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలో వెంకటాపురం జంక్షన్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందగా, మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాంబిల్లి మండలంలో నేవల్ బేస్ కాలనీకి చెందిన గుడాల జీవన్‌కుమార్, భార్య రత్నంతో పాటు కుమారుడు చర్విక్(4)తో కలిసి విశాఖపట్నం వెళ్తున్నారు. ఈ క్రమంలో వెంకటాపురం జంక్షన్ వద్ద యలమంచిలి నుంచి అచ్యుతాపురం వెళ్తున్న లారీ ఢీకొనడంతో చర్విక్‌కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. చర్విక్‌ను ముందుగా అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తర్వాత విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రత్నం రెండు కాళ్లకు తీవ్ర గాయాలు కాగా, జీవన్‌కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్వారీ పనులను అడ్డుకున్న రైతులు



క్వారీ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

మాకవరపాలెం : పంటలకు నష్టం కలిగించే క్వారీ తెరవద్దంటూ మండలంలోని జీకోడూరు గ్రామానికి చెందిన దళిత రైతులు మరోసారి ఆందోళనకు దిగారు. జీకోడూరు రెవెన్యూలోని 332 సర్వే నంబర్‌లో గతంలో నల్లరాతి క్వారీ నిర్వహించేవారు. కొంత కాలంగా నిలిపివేసిన క్వారీని ఇపుడు మళ్లీ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై 15 రోజుల క్రితం క్వారీ వద్ద ఆందోళన చేపట్టారు. కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపి వినతిపత్రాలు అందజేశారు. ఈ నేపథ్యంలో శనివారం క్వారీని ప్రారంభించేందుకు లీజుదారులు క్వారీ వద్దకు చేరుకోవడంతో రైతులు పనులు చేయకుండా అడ్డుకున్నారు. రూరల్ సీఐ రేవతమ్మ, స్థానిక ఎస్‌ఐ దామోదర్‌నాయుడు క్వారీ వద్దకు చేరుకుని ఎలాంటి ఘర్షణలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

17న జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహాసభ



జాతీయ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మొల్లి సన్నిబాబు, సంఘం నాయకులు

అనకాపల్లి: విజయవాడలో ఈనెల 17న జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభ నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మొల్లి సన్నిబాబు తెలిపారు. శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ విజయ రెసిడెన్సీ హాల్లో మహాసభ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ వర్గీకరణ చేసి రాజ్యాధికారం వచ్చే వరకూ పోరాటాలు చేసే సమయం ఆసన్నమైందన్నారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా అమలు చేయాలన్నారు. చట్ట సభలతోపాటు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు, మండల్ కమిషన్ సిఫార్సులను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కిల్లాడ అప్పలరాజు, బోయిన భానుమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు



వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు



కలశాలతో అష్టోత్తర పూజలు

అనకాపల్లి: స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం విజయబాబు, గిరిబాబుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి వివిధ పూజలు, చక్రస్నానం, పూర్ణాహుతి హోమం, స్వామివారికి ఏకోత్తర సహస్ర((1001) కలశాలతో 108 కలశాలతో అష్టోతర పూజలు, సాయంత్రం ధ్వజావరోహణ, లక్ష తులసి, లక్ష కుంకుమార్చన వంటి పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు విజయబాబు మాట్లాడుతూ 400 సంవత్సరాల చరిత్ర కలిగిన దేవాలయంలో 1870లో ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ జరిగిందన్నారు. ఇది వంద సంవత్సరాల పూర్తయిన సందర్భంగా వజ్జల నరసింహాచార్యులు ఆధ్వర్యంలో 1970లో పవిత్రోత్సవాలు ప్రారంభించారన్నారు. ఆనాటి నుంచి ఏటా సప్త ఆనిహిక పవిత్రోత్సవం పాంచరాత్ర, ఆగమోక్తముగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అర్చకులు పులఖండం ప్రసాద్, రాజేష్, ఈవో బి.మురళీకృష్ణ, చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.